నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

13 | హైదరాబాద్, సోమవారం 8 జనవరి 2024 | HYDERABAD


## నుమాయిష్ మస్త్ రష్

ఆదివారం సెలవు దినం కావడంతో నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో కొనసాగుతున్న అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనకు సందర్శకులు పోటెత్తారు. కొనుగోలు దారులతో స్టాల్స్ కిక్కిరిసిపోయాయి.




# అదా.. ఇదా..?

మెట్రో రెండో దశపై.. కసరత్తు



## ఇంజినీర్లు, కన్సల్టింగ్ నిపుణులతో మేధోమథనం

- సీఎం ఆదేశాల మేరకు సులభమైన మార్గాలపై అధ్యయనం
- భూమి మీద మెట్రో మార్గం ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలి
- కొత్తగా మెట్రో డిపోలు, ఆపరేషనల్ కమాండ్ కంట్రోల్ సెంటర్స్ ఏర్పాటు
- ఇంజినీర్లకు మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి సూచనలు

**చాంద్రాయణగుట్ట లోనే మెట్రో ఇంటర్‌చేంజ్..?**



సవరించిన మెట్రో రెండో దశ మార్గాలపై ఇంజినీర్లతో చర్చిస్తున్న హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో రైల్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్వీఎస్ రెడ్డి, ఉన్నతాధికారులు

సిటీబ్యూరో, జనవరి 7 (నమస్తే తెలంగాణ) : కొత్త ప్రభుత్వం ప్రతిపాదించిన మెట్రో మార్గాలపై కసరత్తు మొదలైంది. ఇంజినీరింగ్ నిపుణులతో ఆదివారం బేగంపేటలోని మెట్రో రైలు భవన్‌లో హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో రైల్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్వీఎస్ రెడ్డి ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి కీలకమైన అంశాలపై ప్రత్యేకంగా చర్చించారు. మొదటి దశ కన్నా మరింత మెరుగైన, తక్కువ వ్యయంతో రెండో దశ మెట్రో మార్గాలను నిర్మించడంపై ఇంజినీర్లు, కన్సల్టింగ్ నిపుణులతో సుధీర్ఘంగా మేధోమథనం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం మెట్రో రెండవ దశలో చేపట్టే మార్గాలను సమూలంగా సవరించింది. మొత్తం ఐదు మార్గాల్లో 76 కి.మీ మేర మెట్రో కారిడార్లను నిర్మిస్తూ, ఎయిర్‌పోర్టును, కొత్తగా నిర్మించే హైకోర్టు సముదాయాన్ని అనుసంధానం చేస్తూ కొత్త మార్గాలను సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. దానికి అనుగుణంగానే నాగోల్ - ఎల్‌బీనగర్ - మైలార్‌దేవ్‌పల్లి–శంషాబాద్ ఎయిర్‌పోర్టు, లేదా నాగోల్–ఎల్‌బీనగర్–మైలార్‌దేవ్‌పల్లి– కొత్తగా నిర్మించే హైకోర్టు భవనం (రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం) వరకు నిర్మించే రెండు మార్గాల్లో ఏ దానికి ప్రాధాన్యతనివ్వాలన్న అంశంపై ప్రధానంగా ఇంజినీర్లలో చర్చించారు.

### ఇంటర్‌చేంజ్ స్టేషన్‌గా చాంద్రాయణగుట్ట

ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా మీదుగా వచ్చే మెట్రో మార్గాన్ని చాంద్రాయణగుట్ట వరకు పొడిగించి, పాతబస్తీకి ఎయిర్‌పోర్టుకు మెట్రో కనెక్టివిటీ కల్పించి ఇంటర్‌చేంజ్ స్టేషన్‌గా చాంద్రాయణగుట్టను పరిగణలోకి తీసుకొని అధ్యయనం చేయాలని మెట్రో ఎండీ సూచించారు. రెండు వైపుల నుంచి మెట్రో మార్గాలు చాంద్రాయణగుట్ట చౌరస్తాలో కలపాలంటే ఇప్పటికే అక్కడ ఉన్న ఫ్లై ఓవర్ బ్రిడ్జి ప్రధాన అడ్డంకిగా మారనున్నది. అంతేకాకుండా రోడ్ల విస్తరణ చేపట్టాల్సి ఉంటుంది. మెట్రో రైళ్లు రివర్స్ తీసుకునేందుకు, ఒక ట్రాక్ నుంచి మరో ట్రాక్‌పైకి వెళ్లేందుకు వీలుగా అనువైన స్థలం ఉండాలి. ఇవన్నీ జరగాలంటే చాంద్రాయణగుట్ట చౌరస్తా కాకుండా మైలార్‌దేవ్‌పల్లి వెళ్లే వైపు ఇంటర్‌చేంజ్ స్టేషన్ ఏర్పాటుకు సానుకూలతలను గుర్తించాలని ఇంజినీర్లకు ప్రత్యేకంగా సూచించారు.

### కొత్తగా మెట్రో డిపోలు, ఆపరేషన్ కంట్రోల్ సెంటర్లు

మెట్రో రెండో దశలో నడిపే రైళ్ల కోసం కొత్తగా మెట్రో డిపోలు, నిర్వహణ కోసం ఆపరేషన్ కంట్రోల్ సెంటర్ (ఓసీసీ) అవసరముంటుందని, వీటిని దృష్టిలో పెట్టుకొని ఎక్కడ మెట్రో డిపోలు ఏర్పాటు చేయాలనే దానిపై అధ్యయనం చేయాలని సూచించారు. ముఖ్యంగా మైలార్‌దేవ్‌పల్లి నుంచి ఎయిర్‌పోర్టు రోడ్డులో కొంత దూరం మెట్రో మార్గాన్ని భూమి మీద నిర్మించేందుకు ఉన్న సాధ్యాసాధ్యాలను గుర్తించాలన్నారు. రెండో దశలో నిర్మించే మెట్రో మార్గంలో ఖర్చును తగ్గించేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారని, దానికనుగుణంగానే ఇంజినీర్లు అధ్యయనం చేయాలన్నారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, మెట్రో రైడర్ షిప్‌ను పెంచడం కోసం ఉత్తమ పద్ధతులను తెలుసుకోవడంతో పాటు ఇప్పటికే నిర్వహణలో ఉన్న మెట్రో మొదటి దశ అనుభవాన్ని పరిగణలోకి తీసుకోవాలన్నారు. కొత్త మెట్రో స్టేషన్లలో తగినంత పార్కింగ్ సదుపాయం ఉండాలని, మెట్రో స్టేషన్ల నుంచి చివరి మైలు కనెక్టివిటీ, పాదచారులకు మంచి సౌకర్యాలు ఉండేలా చూడాలన్నారు. ప్రధానంగా ఎయిర్‌పోర్టుకు వెళ్లే మెట్రో ప్రయాణికుల లగేజీ కోసం మెట్రో రైళ్లలో తగినంత స్థలం ఉండేలా డీపీఆర్‌లను సిద్ధం చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ డీ.వీ.ఎస్.రాజు, చీఫ్ సిగ్నల్ అండ్ టెలికాం ఇంజినీర్ ఎస్‌కే.దాస్, చీఫ్ ప్రాజెక్టు మేనేజర్ బి.ఆనంద్‌మోహన్, జనరల్ మేనేజర్లు ఎం.విష్ణువర్ధన్ రెడ్డి, బీఎన్.రాజేశ్వర్, కన్సల్టెన్సీ సంస్థకు చెందిన మెట్రో రైలు ప్రాజెక్టు నిపుణులు పాల్గొన్నారు.

### మొదటి దశకు, రెండో దశకు ఒకే సిగ్నలింగ్ టెక్నాలజీ

ప్రస్తుతం నగర వాసులకు అందుబాటులో ఉన్న మొదటి దశ మెట్రో రైలు కోసం వాడుతున్న సిగ్నలింగ్ టెక్నాలజీ, రెండో దశకు వాడుకునేందుకు అనుకూలంగా ఉంటుందా లేదా అన్న అంశానికి ఎక్కువ ప్రాధాన్యతనిచ్చి, దానిపై ప్రత్యేకంగా అధ్యయనం చేయాలని కన్సల్టింగ్ ఇంజినీర్లకు సూచించారు. రెండు దశలకు సంబంధించి ఒకే విధమైన సిగ్నలింగ్, రైలు నియంత్రణ వ్యవస్థ, కోచ్‌లను వినియోగించడం వల్ల కలిగే లాభాలు, నష్టాలపైనా సుదీర్ఘంగా చర్చించారు. ఇప్పటికే ఉన్న సాంకేతికత, మెట్రో కోచ్ సరఫరాదారుల పరిమిత వాణిజ్య పద్ధతులను కాదని, కొత్తగా పోటీదారుల నుంచి టెక్నాలజీని వినియోగించుకోవడంతో ఏ మేరకు ప్రయోజనం ఉంటుందన్న విషయాన్ని పరిగణలోకి తీసుకొని అధ్యయనం చేయాలన్నారు. ముఖ్యంగా మెట్రోలో ప్రయాణించే వారికి అతుకులు లేని ప్రయాణ సౌకర్యాన్ని కల్పించేందుకు అధిక ప్రాధాన్యతనివ్వాలని మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి ఇంజినీర్లకు దిశానిర్దేశం చేశారు.



## చెట్లను హత్తుకొని.. రక్షించమని వేడుకొని..!

కాప్రా, జనవరి 7 : చెట్లను నరకవద్దని, పర్యావరణాన్ని కాపాడాలని కోరుతూ.. సైనిక్‌పురి చిల్డ్రన్స్‌పార్కులో ఆదివారం ఉదయం 7 నుంచి 10 గంటల వరకు పర్యావరణ ప్రేమికులు, యువకులు వృక్షాలను హత్తుకొని నిరసన తెలిపారు. చెట్లను ఇష్టానుసారంగా నరికే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ రమామెల్కోటే, మనోజ్ఞరెడ్డి, శైలేశ్, కిరణ్, చర్లపల్లి కాలనీల సమాఖ్య సీసీఎస్ ప్రతినిధులు పద్మారెడ్డి, డాక్టర్ కుమారస్వామి, తిరుమల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మిల్లెట్ ప్రాసెసింగ్‌పై ఇక్రిసాట్‌లో శిక్షణ

సిటీబ్యూరో, జనవరి 7(నమస్తే తెలంగాణ): చిరుధాన్యాల వినియోగం, సాగుపై విస్తృతంగా కృషి చేస్తున్న ఇక్రిసాట్ సంస్థ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇండియన్ టెక్నికల్ అండ్ ఎకనామిక్ కార్పొరేషన్ ప్రోగ్రాంలో భాగంగా విదేశాంగ మంత్రిత్వ శాఖ, ఇక్రిసాట్ కలిసి మిల్లెట్ ప్రాసెసింగ్‌పై అంతర్జాతీయ స్థాయిలో ఫిబ్రవరి 11 నుంచి మార్చి 2 వరకు ఔత్సాహిక మహిళలు, యువతకు శిక్షణనివ్వనున్నారు. వివరాలకు పటాన్‌చెరులోని ఇక్రిశాట్ సెంటర్‌ను సంప్రదించాలని సూచించారు.

## నేటినుంచి సర్కిళ్లు, జోనళ్లలో ప్రజావాణి

సిటీబ్యూరో, జనవరి 7 (నమస్తే తెలంగాణ) : జీహెచ్‌ఎంసీ పరిధిలోని సర్కిల్, జోనల్ కార్యాలయాల్లో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కమిషనర్ రొనాల్డ్ రాస్ ప్రారంభించనున్నారు. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఈ నెల 22 నుంచి ప్రధాన కార్యాలయంలో ప్రజావాణి నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.




## గులాబీలు ఇచ్చి.. హెల్మెట్ పెట్టుకొమ్మని..

సిటీబ్యూరో, జనవరి 7 (నమస్తే తెలంగాణ) : హెల్మెట్ ధరించండి.. ప్రాణాలు కాపాడుకోండి అంటూ.. ప్రఖ్యాత న్యూరోసర్జన్ డాక్టర్ ప్రతాప్‌కుమార్ పర్యవేక్షణలో తెలంగాణ న్యూరోసైన్సెస్ సొసైటీ అండ్ ఆగాఖాన్ అకాడమీలో చదువుతున్న 11వ తరగతి విద్యార్థి ప్రియాంషు నందిగామ నేతృత్వంలో వాహనదారులకు గులాబీ పూలు ఇచ్చి.. హెల్మెట్ ధరించాలని తెలిపారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కులో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ట్రాఫిక్ డీసీపీ సుబ్బరాయుడు, ఏసీపీ మట్టయ్య, పీడియాట్రిషన్ డాక్టర్ శ్రీకాంత్, ప్రియాంషు, ఫిట్ ఇండియా ఫౌండేషన్ అధ్యక్షుడు స్వామి, కేబీఆర్ పార్కు వాకర్స్, హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు, విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న గార్బా నృత్యాలు

ఖైరతాబాద్, జనవరి 7 : తెలంగాణ గుజరాతి సమాజ్ ఆధ్వర్యంలో నెక్లెస్‌రోడ్‌లోని పీపుల్స్‌ప్లాజా వేదికగా ఆదివారం గుజరాతి గౌరవ్ ఏక్తా మహోత్సవాలను నిర్వహించారు. ఇందులో భాగంగా నిర్వహించిన గుజరాతీల గార్బా నృత్య ప్రదర్శన ఆకట్టుకున్నది. వేలాది మందితో చేపట్టిన గౌరవ్ యాత్ర ఉత్సాహంగా సాగింది. ఈ యాత్రను తెలంగాణ గుజరాతి సమాజ్ అధ్యక్షుడు ప్రేమల్ పారేఖ్, ఉపాధ్యక్షులు చందులాల్ పటేల్, మన్సుఖ్ పటగేల్, ప్రధానకార్యదర్శి మీనల్ వఖారియాతో కలిసి ప్రారంభించారు. జలవిహార్ వరకు కొనసాగిన యాత్రలో గుజరాతీ మహిళలు, యువతులు సంప్రదాయ దుస్తులతో పాటు పగడీలు ధరించి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గుజరాతి సమాజ్ కోశాధికారి కృష్ణకాంత్ ఫారిక్, ఏక్తా మహోత్సవాల చైర్మన్ చేతన్ బోగాని, జస్మత్ పటేల్ పాల్గొన్నారు.





## తనువే.. తరిమే..!

"తనువే.. తరిమే.. ఎద అందానితో నిండినదే.." అంటూ.. పొలిమేర ఫేం కామాక్షి భాస్కర్ల కుర్రకారు మతిపోగొడుతున్నది. ఆదివారం నగరంలో ఫస్ట్ ఫ్యాషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన కామాక్షి ఫొటోలకు ఫోజులిస్తూ.. తన అందాలను ఆరబోసింది.



## ఆన్‌లైన్‌లోకి అభయహస్తం

**30 సర్కిళ్లలో 3500 మందితో దరఖాస్తుల డేటా ఎంట్రీ**

**పర్యవేక్షణాధికారులుగా సీనియర్ ఐఏఎస్‌లకు బాధ్యతలు**

సిటీబ్యూరో, జనవరి 7 (నమస్తే తెలంగాణ ) : రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో 'అభయహస్తం' కింద ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులన్నింటికీ పక్కాగా జీహెచ్‌ఎంసీ డేటా ఎంట్రీ చేపడుతున్నది. 30 సర్కిళ్ల పరిధిలో 24,74,325 దరఖాస్తులు రాగా.. ఇందులో అభయహస్తం కింద 19,01,256, ఇతర దరఖాస్తులు 5,73,069 లను స్వీకరించారు. ఈ దరఖాస్తులన్నింటినీ ఆన్‌లైన్‌లోకి చేర్చాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆదివారం సెలవు దినం అయినప్పటికీ 3500 మంది ఆపరేటర్లతో దరఖాస్తుల డేటా ఎంట్రీ ప్రక్రియను మొదలు పెట్టారు. ఈ నేపథ్యంలోనే జీహెచ్‌ఎంసీలోని 5 జోన్లకు ఒక్కో సీనియర్ ఐఏఎస్ అధికారిని ప్రత్యేక పర్యవేక్షణాధికారులుగా ప్రభుత్వం నియమించింది. ఈ నెల 17వ తేదీలోగా పూర్తి చేయాలని సంబంధిత కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది. కాగా అభయహస్తం కింద వచ్చిన దరఖాస్తులను మాత్రమే డేటా ఎంట్రీ చేపడుతున్నారు. రేషన్ కార్డు, ఇతర సమస్యలపై వచ్చిన దరఖాస్తులను ఎంట్రీ చేయడం లేదు. వీటిపై ప్రభుత్వం ఎటువంటి స్పష్టత ఇవ్వలేదు. పండుగ సెలవుల కారణంగా గడువులోగా దరఖాస్తుల ఎంట్రీ పూర్తవుతుందో.. లేదో? అన్న అనుమానాలు వస్తున్నాయి. ఇక అర్హుల ఎంపికకు సంబంధించి ప్రభుత్వం ఇప్పటివరకు ఎటువంటి మార్గదర్శకాలను విడుదల చేయకపోవడం పట్ల ప్రజల్లో తీవ్ర చర్చ జరుగుతున్నది.


SPECIAL Sankranthi OFFERS!

CHEROKEE LADIES JEANS & TOPS Flat Rs.399/- MRP upto Rs.1599/-

KAIJAS MENS 100% COTTON SHIRTS Flat Rs.499/- MRP upto Rs.899/-

OCTAVE MENS & BOYS T-SHIRTS SWEAT SHIRTS & HOODIES 20% to 30% OFF

CHEROKEE GIRLS PRINTED LEGINGS Flat Rs.199/-

FRESH ARRIVALS BOYS & GIRLS ETHNIC WEAR

LADIES SELECTED FOOTWEAR FLAT 50% OFF
KIDS LIGHTING SHOES
FANCY FOOTWEAR for Boys, Girls & Ladies

KAIJAS MENS DENIM JEANS Flat Rs.899/- MRP upto Rs.1799/-

KAIJAS MENS 100% COTTON CARGO PYJAMAS Rs.495/- ONWARDS

Exclusive Largest Collection for NEW BORNS INFANTS & KIDS AT LOWEST PRICES

BIG DISCOUNTS on National Brands & Many More OFFERS

CHERMAS®
ABIDS • SEC'BAD • MALAKPET
SK-ONE SHARATH CITY CAPITAL MALL, KONDAPUR

FRESH STOCKS DAILY

*CONDITIONS APPLY